# మనం మారేదెప్పుడు?

"అమ్మా! డాక్టరమ్మా! తల్లీ! ఎలాగైనా మా లక్ష్మికి మొగబిడ్డ పుట్టేలా చూడు తల్లీ! నీ మేలు మర్చిపోను తల్లీ! నా చర్మంతో చెప్పులుకుట్టయినా నీ ఋణం తీర్చుకుంటాను తల్లీ! లేదంటే నా కూతురి కాపురం కూలిపోతుందమ్మా!" అంటూ, అడగా పెట్టాకుండా రూప కన్సల్‌టింగ్ రూంలోకి దూసుకొచ్చి, కాళ్ళని చుట్టేసుకుని, కన్నీళ్ళతో బతిమాలుతున్న స్త్రీకేసి, రాస్తున్న కాగితాల్ని ఆపి వింతగా చూసింది డాక్టర్ రూప.

డాక్టర్ వృత్తి చేపట్టిన కొద్ది సంవత్సరాలలోనే రూపకి పేషంట్లతో అనేక రకాల అనుభవాలు ఎదురయ్యాయి. కానీ యింతవరకూ ఏ ఒక్కరూ కూడా యిలాంటి వింత కోరికని కోరలేదు. అందులో భగవంతుడి సృష్టినే మార్చమని కోరడం ఎంత అర్ధరహితమైందో తెలియని వయసు కాదామెది. కానీ ఎట్టి పరిస్థితులు ఆమె నీ స్థితికి దిగజార్చాయో!' ననుకుంటూ ఆమెకేసి జాలిగా చూసి, లేవనెత్తి ఆమెని ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చోమంది.

'చూడండి శాంతమ్మగారూ! మీ కూతురి విషయంలో డాక్టర్‌గా నేను చేయగలిగింది చెయ్యడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను గానీ ఆడని మగ, మగని ఆడగా మార్చి పుట్టించగలిగే శక్తి యింత వరకూ నాకే కాదు ఏ దేశంలోనూ, ఏ ఒక్కరికీ కూడా సాధ్యమయ్యేపని కాదు. అయినా మీ అమ్మాయికిది మొదటికాన్పేకదా? ఈసారి కాకపోతే మరోసారి కొడుకు పుట్టొచ్చనుకోవాలి. అయినా ఆడా – మగా అంటూ బాధపడే రోజులు వెళ్ళిపోయాయి. ఈ రోజుల్లో ఏ పిల్లయినా ఒకటేనమ్మా!" అంటూ నచ్చ జెప్పబోయిన రూపని కన్నీళ్ళతో చూస్తూ "కాదు తల్లీ! నా అల్లుడెంత కర్కోటకుడో మీకు తెలీదమ్మా! అంటే అన్నంత పనీ చేసి చూపిస్తాడమ్మా! అసలే దాని బతుకు దినదిన గండం – అందులో ఈ నెల తప్పిందని తెలిసిన రోజునుంచీ యిదో కొత్త హింసతో కాల్చుకు తింటున్నాడు. కొడుకుని కంటేనే మళ్ళీ ఇంట్లో కాలెట్టమనీ లేకపోతే ఆసుపత్రి నుంచే పుట్టింటికిపొమ్మనీ చెప్పేసాడమ్మా!"

అంటూ ఏడుస్తున్న ఆమెని చూసి ఏం చెప్పాలో అర్థంకాక, అట్టి పరిస్థితుల్లో ఏం చెప్పినా ప్రయోజనం లేదని తెలిసిన రూప 'మీ అల్లుడితో నేను మాట్లాడతా' నంటూ ఆమెని పంపి, కుర్చీ వెనక్కి వాలి ఆలోచించసాగింది....

* * *

అంతదాకా బంధుమిత్రులతో కబుర్లాడుతూ సందడిగా ఉన్న ఆ యిల్లు ఒక్కసారిగా ఏడుపులు, పెడబొబ్బలతో శ్మశాన వాటికలా తయారయి పోయింది.

అలకపాన్పుమీద అడిగిన స్కూటర్ తండ్రి యివ్వలేనన్నాడన్న కోపంతో నానా హంగామా చేసి పక్కనున్న భార్య చెయ్యి పట్టుకుని బైటికి లాక్కెళ్ళిపోయాడు సుకుమార్. యిరవై ఏళ్ళ పాటు తనని పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులకుండే హక్కుకంటే, పుస్తెకట్టిన క్షణంనుంచీ భర్తకుండే అధికారం ఎక్కువని నలుగుర్లో నిరూపించుకున్న సుకుమార్‌ని ఏ ఒక్కరూ ఆపలేకపోయారు. భర్త వెంట బైటికొస్తూ, గదిలో ఏడుస్తున్న తన వాళ్ళని చూసి దుఃఖం ఆపుకోలేకపోయింది.

"కొత్త పెళ్ళి కూతుర్ని తిన్నగా యింటికి తీసుకెళ్ళిన సుకుమార్ యిదుగో ఈనాటి లగాయతూ నీవాళ్ళని మర్చిపోయి ఈ యింట్లోనే చచ్చేదాకా పడుండాలి. తెలిసిందా?" అన్న మాటలకి, వైవాహిక జీవితం గురించి కన్న కోటి కలల్ని తనలోనే సమాధి చేసుకుంటూ మౌనంగా తలూపింది. తన్ని. తన వాళ్ళని తలవకూడదని చెప్పిన సుకుమార్ మాత్రం స్కూటర్ యివ్వలేదన్న కక్షతో ప్రతీక్షణం తన పుట్టింటి వారిని తిడుతూ, దుమ్మెత్తి పోస్తూ ఆడే మాటల్ని వినడం చిరాగ్గానే వుండేది. తండ్రి తన భర్తకి తీర్చలేని కోరికకి ఫలితంగా తనెంతటి శిక్ష ననుభవించవలసి వస్తోందో ఈ గడపలో అడుగెట్టిన క్షణంనుంచే తెలుసుకుంది.

ఎదుటి మనిషికి కూడా మనసుంటుందనిగానీ, తన మాటలకీ, దెబ్బలకీ బాధపడుతుందనిగానీ ఆలోచించని సుకుమార్, గట్టిగా తగిలిన దెబ్బకి 'అమ్మా!' అని బాధపడడం జరిగితే "ఇదిగో మరెప్పుడేనా మీ అమ్మని తలుస్తావా? నీకు ముందే చెప్పాను. ఆ యింటిని, ఆ మనుషుల్ని శాశ్వతంగా మర్చిపోవాలని, నీ దృష్టిలో వాళ్ళంతా చచ్చారనుకుని నా ఇంట్లోవుండు. ఎట్టిపరిస్థితుల్లోనూ నీ నోటంట అమ్మా,అబ్బా అన్న శబ్దాలు మళ్ళీ వినపడితే చంపేస్తాను. అంటూ వాళ్ల హూనం చేసేవాడు.

ఆ నరకకూపంలో ఏడాదికంటే గడపలేకపోయింది. అతని కసి తీరేదెప్పుడో తెలీదు.

కానీ తన సహనంమాత్రం ఆ హింసలకి తట్టుకోలేక ఓడిపోయి "నా వంటి వాళ్లే ఆత్మహత్యలకి పాల్పడతారుగామోసు" అనుకుంది. అనుకోవడమే కాదు. ఓ రోజు ఆత్మహత్య చేసుకోవాలన్న నిశ్చయానికొచ్చి బయలుదేరింది. సముద్రపొడ్డుకి చేరి ఓ మూలగా కూర్చుంది, జనసంచారం తగ్గేకా తన కష్టాలని సముద్రుడికి చెప్పుకుని శాశ్వతంగా విముక్తి పొందాలని.

సాయంసంధ్యలో సముద్రపొడ్డున కొందరు పల్లెదంపతులు పడవల్లోంచి చాపల్ని తీసి బుట్టల్లో వేస్తున్నారు. బేరగాళ్ళతో కలిసి బేరంచేస్తున్నారు. "ఎంతాదర్శదాంపత్యం? జీవితంలో స్త్రీ కోరుకునేదేమిటి?? డబ్బా? సుఖమా? తిండికి లేకపోయినా భర్త ఆదరణ, ఆప్యాయతలతో ఆనందంగా జీవించగలిగిన ఆడదాని జీవితమెంత ధన్యమయింది!" అనుకుంది. "ఆఖరికి తనింట్లో పనిమనిషి తన గడన తాను గడించుకుని హాయిగా జీవిస్తోంది. విద్యలేని స్త్రీలే తమ బతుకులు తాము బతుకుతున్నప్పుడు తనెందుకు బతకలేదు!" అనుకుంది. ఇలా ఎందరో తనముందాదర్శంగా మెదిలారు. ఆ వెంటనే తనలో ఏదో శక్తి ప్రవేశించింది. ఇన్నాళ్ళూ తన చాతకాని తనమే తననీ స్థితికి దిగజార్చిందన్న ఆలోచన రాగానే వెనుదిరిగింది. 'నాచేతిలో డిగ్రీవుంది. దాన్ని సద్వినియోగ పర్చుకోవాలి. ముందుగా యిలాంటి వారికి బుద్ధిచెప్పి మరీ ఆ ఇంట్లోంచి వెళ్ళాలనుకుంది'

తిన్నగా పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళిన తన భర్త పెడుతున్న హింసల్ని వ్రాత మూలకంగా వ్రాసి యివ్వడమే కాకుండా ఋజువు పరుస్తానంటూ తనవెంట తీసుకెళ్ళింది.

అగ్ని గోళాల్లాంటి కళ్ళతో, సెగలు కక్కుతున్న శరీరంతో, కోపాన్ని పట్టలేక అటూ, ఇటూ తిరుగుతున్న సుకుమార్ అప్పుడే లోపలికి వస్తున్న తన చెంప ఛెళ్ళుమనిపించి, "ఎవడిదగ్గరకి వెళ్ళావే రాస్కెల్!" అంటూ జుట్టు పట్టుకుని ఈడ్చుకుపోవడం, ఆ వెనకే దాగివున్న పోలీసులు వచ్చి అతన్ని స్టేషన్‌కి తీసుకెళ్ళడం కొద్ది క్షణాల తేడాలోనే జరిగి పోయాయి. అనుకోని ఈ హఠాత్‌పరిణామానికి షాకయిపోయాడు సుకుమార్.

భర్తపెట్టిన హింసల్ని ఋజువుపర్చి విడాకులుచ్చుకున్న రోజు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంది.

ప్రతీనెలా సుకుమార్ దగ్గర పుచ్చుకునే భరణానికి తన పట్టుదల, శ్రద్ధలని జోడించి డాక్టర్ పట్టా పుచ్చుకుని ప్రాక్టీసు పెట్టింది.

* * *

పీడకలొచ్చి ఉలిక్కిపడిలేచిన దానిలా, తన జీవితంలోని విషగడియల్ని తల్చుకుని ఈ లోకంలోకి వచ్చింది రూప. లేచి టైము చూసుకుంది. మెడలోంచి స్టెతస్కోప్ తీసి బల్లమీదపెట్టి బైటికొచ్చింది.

'ఇదిగో అర్థమయిందా? మొగపిల్లవాడిని కంటేనే ఖర్చులు నేను పెట్టేది. లేకపోతే మీ అమ్మ ఎవడిదగ్గరకెళ్ళి తీసుకొస్తుందో తెమ్మను.

నేను చిల్లుకానీ యిచ్చేది లేదు! నీ సంగతీ అంతే నా గుమ్మం మళ్ళీ తొక్కాలంటే కొడుకు నెత్తుకోవాలని గుర్తుంచుకో!' అంటూ ఎగురుతున్న వ్యక్తిని, బైటికొస్తున్న డాక్టర్ రూప చూసి నిర్ఘాంతపోయి నిలబడి పోయింది. ఛీత్కారంగా అతనివైపుకి చూసింది.

వెనక్కి తిరిగిన సుకుమార్ రూపని చూసి క్షణం స్థబ్ధుడిలా నిలబడిపోయాడు.

"ఏయ్ మిస్టర్! ఆడా, మగా అన్నది నీ, నా చేతుల్లోనూ, నీ భార్య చేతుల్లోనూ లేదన్నది తెలుసుకోలేని మీలాంటి మూర్ఖుల్ని మీ తల్లిదండ్రులు వృథాగా ఖర్చుపెట్టి ఎందుకుచదివించారో అర్థమవటంలేదు. నీలాంటి బుద్ధిహీనులకి ఎన్ని వాతలెట్టినా బుద్ధిరాదనుకుంటాను! మరోసారి పోలీస్ రిపోర్టు గానీ యివ్వమంటావా? తిన్నగా వుంటావా?" అన్న రూప మాటలకి రుస, రుస లాడుతూ బైటికెళ్ళిపోయాడు సుకుమార్.

ఏడుస్తున్న లక్ష్మి వద్దకెళ్లి ఊరడించసాగింది రూప.

అప్పుడే బైటినుంచి పరిగెత్తుకొచ్చిన శాంతమ్మ "అమ్మా! డాక్టరమ్మా! ఏమయిందమ్మా! నా అల్లుడు మళ్ళీ నా గడప తొక్కితే నరికేస్తా నంటూ రంకెలేస్తూ వెళ్ళిపోతున్నా" డంటూ గోల పెట్టడంతో రూప కోపం రెట్టింపయింది.

"చూడండి శాంతమ్మగారూ! ఆరోజు మీరు నా దగ్గరకొచ్చి మీ అల్లుడి గురించి చెప్పినప్పుడు నీ పిల్లకాపురం ఎలా నిలబెట్టడమా! అని ఆలోచించాను. కాని నీ అల్లుడిని చూసాకా ఓ మూర్ఖుడి అహం మరికొంచెం పెంచడం మంచిదికాదని, అతనికే బుద్ధి చెప్పాలని నిశ్చయించుకున్నాను.

మీ అల్లుడెంత మూర్ఖుడో నాకు తెలుసు. అటువంటి వారిని మార్చడానికి ప్రయత్నించాలి. తల ఒగ్గినగొద్దీ మిమ్మల్ని దిగదొక్కే వ్యక్తి. అతనితో కాపురం చెయ్యడం ఎంత నరకమో నాకు తెలియందేంకాదు! ఎట్టిపరిస్థితులకి తలొగ్గి మీరా రెండోపెళ్ళి వాడికి పిల్లనిచ్చారో గ్రహించగలను. నేను చెప్పినట్లు చేసి ఆ నరకం నుంచి బైటికొచ్చి, మీ భవిష్యత్తుని పూలబాట చేసుకోండి. నీ కూతురికి నావద్ద నర్సుట్రెయినింగ్ ఇచ్చి

ఉద్యోగం యిస్తాను. మీరుకూడా నా ఆసుపత్రిలో చేరండి. ఈసారి వాడొస్తే గట్టిగా బుద్ధిచెప్పి పంపండి" అన్న మాటలకి. అంతదాకా ఏడుస్తున్న తల్లీ కూతుళ్ళూ ఉలిక్కి పడి ఆమెని చూసారు.

"చూడమ్మా! నీకు చాతకాకపోతేచెప్పు. అంతేగానీ నా కూతురి కాపురం కూలదొయ్యకమ్మా! ఎంత దుర్మార్గుడైనా వాడు నాకు అల్లుడు, నా కూతురికి మొగుడు. దానింట్లో అది పడుంటే దానికీ నాకూ గౌరవం.

"ఎంతున్నా ఆడదానికి అహం పనికి రాదమ్మా! వాడు మొగాడు! నీకు పుణ్యముంటుంది నా కూతురి కాపురం జోలికిరాకుతల్లీ! అసలు ఏం అన్నావోగానీ యిప్పటికే రెచ్చిపోతూ వెళ్ళేడు. చాలుతల్లీ చాలు ! చేసిన ఉపకారం చాలక యిదా చెప్పేది!" అంటూ కూతురి చెయ్యిపట్టుకుని బైటికెళ్ళిపోతున్న ఆ యిద్దర్నీ నిర్ఘాంతపోయిచూస్తూ నిలబడి పోయింది.

దేశంలో తమని తాము కించపర్చుకునే స్త్రీలున్నంతకాలం అటువంటి మగవారి అహం చావదు. చేయూతనిచ్చి, దారి చూపే వారిని నిందించే లక్ష్మి తల్లి వంటివారు ఉన్నంతకాలం ఈ సమాజంలో సుకుమార్ వంటి వారిని దూషించడం అనవసరం. ముందు మనం మారాలి. ఆడదాని కష్టాల్ని, ఆడది అవగాహన చేసుకోవాలి. సాటి స్త్రీని, సానుభూతితో చూసి, ధైర్యంతో ముందుకి నడవనంత కాలం సుకుమార్ వంటివారికి ఎన్ని పెళ్ళిళ్ళైనా అవుతాయి. సుకుమార్‌లు సుకుమార్‌లల్లాగే వుంటారు అనుకుంది నిట్టూరుస్తూ.

స్వాతి వారపత్రిక

**23 మే 1986**